తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 25- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 82 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# తెలంగాణ హక్కులను కాలరాస్తున్న కేంద్రం:సీఎం రేవంత్

**అమెరికా పర్యటన తిరస్కరణపై సీఎం ఆగ్రహం**
**తెలంగాణపై వివక్ష చూపుతున్నారని ఆరోపణ**
**ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్న వ్యాఖ్యలు**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై సోమవారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి, తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి, విద్య, క్రీడలు, పెట్టుబడుల సాధన లక్ష్యంగా విదేశీ పర్యటన కార్యాచరణ రూపొందించుకున్నామని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశాంగ మంత్రిత్వ శాఖకు ముందుగానే సమర్పించామని తెలిపారు. అయితే ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనను తిరస్కరించడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రాల కలయికనే కేంద్ర ప్రభుత్వం అనే ప్రజాస్వామ్య స్ఫూర్తిని గుర్తుంచుకోవాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలను ప్రపంచానికి పరిచయం చేయడం, విద్యా సంస్థలు, క్రీడా రంగం, పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించడం కోసం అమెరికా పర్యటనను ప్రణాళికబద్ధంగా రూపొందించామని వివరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అన్ని వివరాలు అందించినప్పటికీ అనుమతి నిరాకరించారని, ఇందుకు గల రాజకీయ కారణాలను ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించాలని డిమాండ్ చేశారు.
రాజకీయ నిర్ణయాలతో తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించిన ముఖ్యమంత్రి, అదే సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రికి ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతి ఇవ్వడాన్ని ప్రస్తావించారు.
మిగతా 2లో





# డీజీపీకి బహిరంగ లేఖ రాసిన ఎంపీ

**తనపై నిఘా పెట్టారంటూ ఆరోపణ**
**రాజకీయ జోక్యంపై వివరణ కోరిన అరవింద్**
**పోలీసులు చట్టం ప్రకారమే పనిచేయాలన్న డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**
నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు బహిరంగ లేఖ రాశారు. ఇటీవల తన కదలికలను పర్యవేక్షించేందుకు తెలంగాణ పోలీసు శాఖలో ఏసీపీ స్థాయి అధికారిని నియమించినట్లు సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు జరుగుతున్నాయనే సమాచారం తనకు అందిందని లేఖలో ఆరోపించారు. దశాబ్దాలుగా సీవీ ఆనంద్‌ను సమర్థ అధికారిగా తెలుసునని ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు. అయితే తనపై నిఘా పెట్టేందుకు ఒక ఉన్నతాధికారిని నియమించారనే సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ అంశంపై స్పష్టత అవసరమని డీజీపీని కోరారు.
తెలంగాణ పోలీసు శాఖ రాజ్యాంగం, చట్టబద్ధ వ్యవస్థ ప్రకారమా లేక
మిగతా 2లో




# 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**22ఏ దరఖాస్తుల్లో 98 శాతం పరిష్కారం**
**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టీకరణ**
**ప్రభుత్వ భూముల రక్షణే ప్రధాన లక్ష్యం**

**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్రంలో 22ఏ కింద లక్షల ఎకరాల భూములను కొత్తగా నిషేధిత జాబితాలో చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుతం నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రజల ముందుకు తీసుకువస్తోందన్నారు. 22ఏ పేరుతో ప్రతిపక్షాలు అనవసర ఆందోళనలు సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్ భూములు, కోర్టు ఆదేశాల మేరకు
మిగతా 2లో

# పవర్ ఎగ్జిబిషన్–2026కు శ్రీకారం

- ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- విద్యుత్ రంగ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం
- ఆధునిక సాంకేతిక సేవలకు ప్రాధాన్యం
- శక్తివంతమైన తెలంగాణ నిర్మాణమే ధ్యేయం

**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**
హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పవర్ ఎగ్జిబిషన్-2026'ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. విద్యుత్ రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని ప్రజలకు పరిచయం చేయడం, భవిష్యత్ ప్రణాళికలను ప్రదర్శించడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక, వ్యవసాయ, గృహ అవసరాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.
మిగతా 2లో





# పోషకాహార అల్పాహారమే ప్రభుత్వ లక్ష్యం

**పిల్లల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి**
**సింగరేణి నిధులతో ఆధునిక వంటశాల**
**మంథనిలో కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం**

**మంథని, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**
పిల్లలు ఆకలితో పాఠశాలకు వెళ్లే పరిస్థితి రాష్ట్రంలో ఉండకూడదని, ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల, చదువుపై ఏకాగ్రత పెంపునకు అల్పాహార పథకం కీలకమని పేర్కొన్నారు.
మిగతా 2లో

# ఐడీఎల్ భూములపై ఈటల ప్రశ్నలు

- హానర్ హోమ్స్ వ్యవహారంపై విచారణ కోరుతూ డిమాండ్
- భూముల కేటాయింపులపై సమాధానం చెప్పాలన్న వ్యాఖ్యలు
- ప్రభుత్వ ఆదాయం పెంచే చర్యలు అవసరమని సూచన
- అర్బన్ సీలింగ్ భూముల పరిరక్షణకు పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**
ఐడీఎల్ భూముల వ్యవహారంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐడీఎల్ ప్రాంతంలో హానర్ హోమ్స్ పేరుతో నిర్మిస్తున్న అపార్ట్మెంట్లలో ఒక్కో నివాస యూనిట్ భారీ ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో జరిగిన భూముల కేటాయింపులపై స్పందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఈ అంశంపై ఎందుకు మౌనం పాటిస్తోందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో భూముల కేటాయింపులపై సమగ్ర విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే హానర్ హోమ్స్ వ్యవహారంపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు.
మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ హక్కులను కాలరాస్తున్న కేంద్రం:సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)



వైబ్రంట్ గుజరాత్ పేరుతో పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలకు అనుమతి ఉంటే, తెలంగాణ రైజింగ్-2047 కోసం చేపట్టిన పర్యటనను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. తన పర్యటనలో ఏవైనా అభ్యంతరకర అంశాలు ఉన్నట్లయితే ఇంగ్లాండ్ పర్యటనకు కూడా అనుమతి ఇవ్వకూడదని, ఒక దేశానికి అనుమతి ఇచ్చి మరో దేశానికి తిరస్కరించడం వివక్షకు నిదర్శనమని అన్నారు. విద్య, క్రీడల అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులు విదేశాల్లో విద్యాభ్యాసం చేసి దేశానికి దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రపంచ స్థాయి విద్య, అవకాశాలు అందుబాటులోకి రావాలంటే విదేశీ సంస్థలతో భాగస్వామ్యాలు అవసరమని, అందుకే విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం చేపట్టిన కార్యక్రమాలని స్పష్టం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికీ గుజరాత్ నాయకుడిగానే వ్యవహరిస్తున్నారని, భారత ప్రధానిగా అన్ని రాష్ట్రాల పట్ల సమాన దృష్టితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తన పర్యటన తిరస్కరణ వ్యక్తిగత అవమానం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనను అడ్డుకోవడం అంటే రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనని, కేంద్రం వైఖరిలో స్పష్టమైన వివక్ష కనిపిస్తోందని ఆరోపించారు. ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా ఖండించాలని అన్ని వర్గాలకు పిలుపునిచ్చారు. ఈ అంశాన్ని తెలంగాణ ఎంపీలు పార్లమెంటులో ప్రస్తావిస్తారని ముఖ్యమంత్రి తెలిపారు. తన పర్యటనను అడ్డుకోవచ్చేమోగానీ తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నిర్వహించి విద్య, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడానికి కృషి చేస్తామని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణను ఎలాంటి అవరోధాలు నిలువరించలేవని, రాష్ట్ర ప్రయోజనాల సాధనలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పోషకాహార అల్పాహారమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)





సోమవారం మంథనిలో సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ఆధునిక కమ్యూనిటీ కిచెన్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు. గంటకు 10 వేల ఇడ్లీలు, 3 వేల దోసెలు, 5,600 పూరీలు తయారు చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని రూపొందించినట్లు వివరించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం కిచెన్‌లో తయారు చేసిన అల్పాహారాన్ని విద్యార్థులతో కలిసి మంత్రి స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. 2011లో ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు ఆహారం అందించే కార్యక్రమంగా ప్రారంభమైన ఈ సేవలు ప్రస్తుతం విస్తృత స్థాయిలో కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం కూడా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఏ.సి. భక్తివేదాంత స్వామి ప్రభుపాద ప్రతిపాదించిన "పది మైళ్ల పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదు" అనే సందేశం ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలిచిందని శ్రీధర్ బాబు తెలిపారు. సమాజంలో ఆకలి నిర్మూలనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు పోషకాహార భద్రత కల్పించడం ద్వారా భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో విద్యాశాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మార్గదర్శకత్వంలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అధ్యయనాల ప్రకారం విద్యాశాఖ కార్యక్రమాల అమలులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఆర్‌జీ3 జీఎం, తహసీల్దార్ ఆరిపొద్దిన్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కమ్యూనిటీ కిచెన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

# ఐడీఎల్ భూములపై ఈటల ప్రశ్నలు

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై విచారణ ఎందుకు జరపడం లేదని, అవసరమైతే చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సంబంధిత భూముల కేటాయింపులపై పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. అక్రమాలు జరిగి ఉంటే భూములను తిరిగి స్వాధీనం చేసుకునే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా జరిగే నిర్ణయాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రానికి భారీ ఆదాయం వచ్చేలా భూముల నిర్వహణలో పారదర్శక విధానాలు అమలు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూముల విలువను కాపాడుతూ ప్రజలకు ప్రయోజనం చేకూరే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రజా ఆస్తుల విషయంలో ఎలాంటి సందేహాలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. అర్బన్ సీలింగ్ పరిధిలోని భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు నిలిపివేయాలని కూడా డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూముల వినియోగంపై నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేసిన ఈటల రాజేందర్, సాధారణ ప్రజల జీవన పరిస్థితులు పెద్దగా మారకపోతే అభివృద్ధి ఫలితాలు అందరికీ చేరడం లేదని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని, ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు.

# మెదక్ కాంగ్రెస్ పీఏసీ సమావేశం

- **ఎస్ఐఆర్ రెండో దశపై చర్చ**
- **గత నిర్ణయాల అమలుపై సమీక్ష**
- **పార్టీ బలోపేతానికి కార్యాచరణ**

**మెదక్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**



మెదక్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సోమవారం మెదక్‌లో నిర్వహించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ఎన్నికల అంశాలు, ఎస్ఐఆర్ రెండో దశ కార్యక్రమాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జిల్లాలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణపై నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి, మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూడా హాజరయ్యారు.

గత పీఏసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్ష నిర్వహించారు. పార్టీ పరంగా చేపట్టిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో జరిగిన పురోగతి, ప్రజలతో మమేకం అయ్యే కార్యక్రమాలపై నాయకులు చర్చించారు. గత సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాల సాధనకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) రెండో దశ కార్యక్రమంపై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు, పార్టీ కార్యకర్తల పాత్రపై నాయకులు సూచనలు చేశారు. ప్రతి అర్హ ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని అభిప్రాయపడ్డారు.

నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితి, భవిష్యత్ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై స్పందన, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంపై కూడా చర్చించారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల మధ్యకు మరింతగా వెళ్లాలని నాయకులు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రాబోయే రాజకీయ, ఎన్నికల కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు, అభిప్రాయాలు సమావేశంలో వ్యక్తమయ్యాయి.

# డీజీపీకి బహిరంగ లేఖ రాసిన ఎంపీ

(మొదటి పేజీ తరువాయి)



రాజకీయ కుటుంబాల ఆదేశాల మేరకా పని చేస్తుందనే ప్రాథమిక ప్రశ్న తలెత్తుతోందని అరవింద్ వ్యాఖ్యానించారు. పోలీసు వ్యవస్థ ప్రజాస్వామ్య విలువలను కాపాడే సంస్థగా ఉండాలని, రాజకీయ ప్రభావాలకు అతీతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ చట్టానికి, రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ రాజకీయ కుటుంబానికి లేదా వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయకూడదని అన్నారు. ఈ అంశంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

తనపై నిఘా వ్యవహారానికి సంబంధించి వాస్తవాలు వెల్లడించాలని ధర్మపురి అరవింద్ డీజీపీని కోరారు. అధికారిక ఆదేశాల ప్రకారమే ఇలాంటి చర్యలు చేపట్టారా లేదా అనే విషయంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ధర్మపురి అరవింద్ చేసిన ఈ ఆరోపణలపై తెలంగాణ పోలీసు శాఖ లేదా రాష్ట్ర ప్రభుత్వ వర్గాల నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. ఈ వ్యవహారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)




నిషేధిత జాబితాలో ఉన్న భూములన్నింటి వివరాలను కేటగిరీల వారీగా వెల్లడిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ ప్రయోజనాల కోసం వినియోగించకుండా కాపాడటమే 22ఏ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఎంత భూమి నిషేధిత జాబితాలో ఉంది, ఎందుకు ఉంది, ఏ కారణాలతో చేర్చారనే ప్రతి అంశాన్ని రికార్డులతో ప్రజల ముందుకు తెస్తామని పేర్కొన్నారు. వాస్తవాలు బయటకు వచ్చిన తర్వాత నిజం ఎవరిదో ప్రజలే నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు.

మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా చూపించే ప్రయత్నాలను గుర్తించినట్లు మంత్రి వివరించారు. నర్సాపూర్ ప్రాంతంలో వందల ఎకరాల ప్రభుత్వ భూముల వ్యవహారాలు, సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో సరైన రికార్డులు లేకుండా భూ హక్కులు సృష్టించిన ఘటనలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. గుమ్మడిదల మండలంలో ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన సందర్భాలను గుర్తించి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వ భూములను రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ సర్వే నంబర్ 403 వ్యవహారంపై కూడా మంత్రి వివరణ ఇచ్చారు. మొత్తం సర్వే నంబర్ అప్‌లోడ్ కావడంతో ముఖ్యమంత్రి నివాసంతో పాటు ఇతర ఆస్తులు కూడా పీఓబీలో కనిపించాయని, దానిని వెంటనే సరిచేసినట్లు తెలిపారు. మహేశ్వరం, పర్వతాపూర్ ప్రాంతాల్లో భూదాన్, సర్వే నంబర్ల గందరగోళం వల్ల ఏర్పడిన సమస్యలను సమగ్ర సర్వేల ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో రికార్డులను కేసుల వారీగా పరిశీలించి వాస్తవ హక్కుదారులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

నకిలీ జీఓలు, బోగస్ మెమోలు, ఫేక్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న అక్రమాలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి తెలిపారు. మేడ్చల్ జిల్లాలో జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ మెమోలు సృష్టించిన ఘటనలు బయటపడ్డాయని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) అంశంపై ప్రభుత్వం త్వరలో విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని మంత్రి తెలిపారు. 22ఏ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని, అందులో 980 ప్రత్యేక ఫిర్యాదులను నమోదు చేసినట్లు చెప్పారు. నిజమైన సమస్యలను 24 గంటల్లో, అవసరమైతే 36 గంటల్లో పరిష్కరించే ఫాస్ట్‌ట్రాక్ విధానాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలను భయపెట్టడం కాదు, భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, న్యాయబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పిస్తూనే ప్రభుత్వ భూములను కాపాడుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



# పవర్ ఎగ్జిబిషన్–2026కు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఒకప్పుడు 13 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్ గరిష్ఠ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు చేరుకున్నప్పటికీ సమర్థవంతమైన ప్రణాళికలతో నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో థర్మల్, సోలార్, హైడల్, బ్యాటరీ స్టోరేజ్ వంటి పలు మార్గాల్లో సామర్థ్యాన్ని పెంచుతున్నామని ఆయన వివరించారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో విద్యుత్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని చెప్పారు. 1912 టోల్‌ఫ్రీ సేవ, పవర్ అంబులెన్స్‌లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ వంటి వినూత్న కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా కల్పించడంతో పాటు పెండింగ్ ప్రమోషన్లను కూడా మంజూరు చేసినట్లు చెప్పారు. ఉద్యోగుల సంక్షేమం, సేవల మెరుగుదల రెండింటినీ సమానంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ కొరత లేని శక్తివంతమైన తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో చేపడుతున్న సంస్కరణలు, ఆధునికీకరణ చర్యలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రైతు బీమా కొనసాగించాలి: హింగే భాస్కర్



**ఎల్కతుర్తి , ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా పథకాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ కోరారు. ఈ మేరకు సోమవారం సమితి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన హింగే భాస్కర్ మాట్లాడుతూ.. రైతు కుటుంబానికి ప్రధాన ఆధారమైన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినప్పుడు రైతు బీమా పథకం ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. పథకం కొనసాగింపుపై రైతుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం నివృత్తి చేసి స్పష్టత ఇవ్వాలని కోరారు.

రైతు బీమా పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకుండా కొనసాగించాలని, ప్రభుత్వం చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ నిరంతరాయంగా బీమా రక్షణ కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

బీమా సొమ్ము అందడంలో జాప్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రైతుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా స్పష్టమైన ప్రకటన చేయాలని హింగే భాస్కర్ కోరారు. రైతు కుటుంబాలకు కష్టకాలంలో రైతు బీమా రక్షణ కవచంగా నిలుస్తోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు భరోసా కల్పించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికిల కిషన్‌రావు, ఉపాధ్యక్షులు రామారావు, సుకినే సుధాకర్, సురావు బాబురావు, వాంకె రాజు, కోక్కు తిరుపతి, అంబిరి శీను, ఎర్రబెల్లి రవీందర్‌రావు, మాధవరావు, గుండ సత్యనారాయణ, నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠకు మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



**అడ్డాకుల,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండల కేంద్రంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలకు దేవరకద్ర బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని అడ్డాకుల గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేసి, విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో అడ్డాకుల సింగిల్ విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సాయి సాగర్, చంద్రమోహన్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజా గోరి, మండల యూత్ అధ్యక్షుడు ఏలుసరి బాలరాజ్, గ్రామ యూత్ అధ్యక్షుడు మహేష్ యాదవ్, వార్డు సభ్యుడు టంకరి శ్రీనివాస్, శేఖర్, నాగన్న తదితర గ్రామస్తులు ఉన్నారు. మూడు రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## బోనాల పండుగకు ముస్తాబైన పోచమ్మ ఆలయాలు



**పెద్దమందడి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్న బోనాల పండుగ సందర్భంగా వెల్టూర్ గ్రామంలోని రెండు పోచమ్మ ఆలయాలు ముస్తాబయ్యాయి. పండుగను పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా, రంగులతో తీర్చిదిద్దారు. దీంతో గ్రామంలో బోనాల సందడి నెలకొంది.పోచమ్మ దేవతకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.బోనాల సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్థులు సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# కర్నె తండా లిఫ్ట్‌తో 4,235 ఎకరాలకు సాగునీరు





- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):**వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలంలోని కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి, నిలిచిపోయిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించే స్థాయికి తీసుకువచ్చిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పంపులను ప్రారంభించారు.రూ.87.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో 4,235 ఎకరాలకు సాగునీరు అందనుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో వనపర్తి జిల్లాలో 3,384 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 851 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.87 కోట్లతో జీవో తీసుకువచ్చినా, సుమారు రూ.47 కోట్లు ఖర్చు చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మిగిలిన పనులను దశలవారీగా పూర్తి చేస్తూ ఇప్పటివరకు సుమారు రూ.29 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే మేఘారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం జీవోలు మంజూరు చేయించి కమిషన్లు దండుకోవడం తప్ప ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నిర్మించలేదని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో తాను కాంట్రాక్టర్‌గా కాకుండా కూలీగా పనిచేసేందుకైనా సిద్ధపడి కాలువల పనులను ముందుకు తీసుకెళ్లానని అన్నారు. రైతుల కోసం చేసిన పనులకు సంబంధించిన బిల్లులను కూడా గత పాలకులు చెల్లించలేదని ఆరోపించారు.కర్నె తండా లిఫ్ట్ ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటివరకు సుమారు రూ.2,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

**గిరిజనుల ఆకాంక్ష మేరకు ప్రాజెక్టుకు సంత్ సేవాలాల్ పేరు**

కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కర్నె తండా లిఫ్ట్ ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.గిరిజనుల ఆకాంక్ష మేరకు కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్గా పేరు మార్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ, రోడ్ల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అబ్కారి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మండల ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- **పెద్దమందడి తహసిల్దార్ మల్లికార్జున్**

**పెద్దమందడి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు)**: వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి తహసిల్దార్ మల్లికార్జున్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణిని వేదికగా ఉపయోగించుకోవాలని తెలిపారు.ప్రజలు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలకు సంబంధించిన వినతులను అధికారులకు అందజేయాలని కోరారు. ప్రజల నుంచి అందే వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ మల్లికార్జున్ తెలిపారు.



## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు



**జవహర్‌నగర్, ఆగస్టు 24, తెలంగాణ ముచ్చట్లు:** జవహర్‌నగర్ డివిజన్ పరిధిలోని గాలా న్యూ దేవేందర్‌నగర్‌లో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మేయర్, జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి, కోటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లేపల్లి సదానంద్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే శంకర్ గౌడ్, వీర భాస్కర్, కొలిపాక సాయికిరణ్, మంద ఆనంద్, గజ్వేల్ శంకర్, వెంకటేష్, శ్రీను తదితర నాయకులు, సీనియర్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 52 ఏళ్ల మహిళ అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**మేడ్చల్, ఆగస్టు 24, తెలంగాణ ముచ్చట్లు-**:మేడ్చల్ పరిధిలో 52 ఏళ్ల మహిళ అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. మాచబొల్లారంలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న వైట్ల ఈశ్వరి అనే 52 ఏళ్ల మహిళ ఆగస్టు 24వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటల 41 నిమిషాల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజీలో నమోదైంది.

ఈ విషయాన్ని ఆమె కుమార్తె వైట్ల సత్యవేణీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఈశ్వరి ఎలాంటి మొబైల్ ఫోన్ వెంట తీసుకెళ్లలేదని తెలిపింది. అప్పటికి నైటీతో పాటు తెల్లటి స్కార్ఫ్ ధరించి ఉన్నట్లు పేర్కొంది. అయితే ఆ తర్వాత దుస్తులు మార్చుకుని పింక్ రంగు చీర ధరించి ఉండే అవకాశం ఉందని ఫిర్యాదులో తెలిపింది.

అదృశ్యమైన మహిళ ఎత్తు సుమారు 5.2 నుంచి 5.4 అడుగులు ఉండగా, మధ్యస్థ తెల్లటి ఛాయ, నలుపుతెలుపు జుట్టు కలిగి ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మహిళను గుర్తించి ఆచూకీ తెలియజేయాలని, ఆమెను సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.



# సుత్తితో తలపై దాడి.. వ్యక్తి మృతి

**జవహర్‌నగర్, ఆగస్టు 24, తెలంగాణ ముచ్చట్లు:** మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. అల్లుడితో జరిగిన ఘర్షణలో సుత్తితో తలపై దాడి చేయడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఫిర్యాదు అందింది.

పోలీసులకు అందిన ఫిర్యాదు ప్రకారం.. సాయిబాబా కాలనీ, దొండతోటకు చెందిన లింగనోళ్ల అండాలు తన భర్త మొగిలితో కలిసి గత పదేళ్లుగా అక్కడ నివసిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉండగా, ముగ్గురికి వివాహాలు జరిగినట్లు తెలిపారు.

ఆగస్టు 23న దొండతోటలోని పెద్ద కుమార్తె ఇంటి వద్ద బోనాల పండుగ జరుగుతుండగా, మొగిలి సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో బయటకు వెళ్లి రాత్రి 8 గంటల సమయంలో ముఖంపై గాయాలతో తిరిగి వచ్చినట్లు అండాలు తెలిపారు. పొరుగువారితో జరిగిన వాగ్వాదంలో తనపై దాడి జరిగిందని మొగిలి చెప్పినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత మొగిలి తన అల్లుడు శివతో గొడవకు దిగినట్లు తెలిపారు. ఈ క్రమంలో మొగిలి కిటికీలను ధ్వంసం చేయడంతో పాటు విద్యుత్ వైర్‌ను తొలగించి, శివకు చెందిన మోటార్‌సైకిల్‌ను కూడా ధ్వంసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన శివ సుత్తితో మొగిలి తలపై రెండుసార్లు బలంగా కొట్టినట్లు ఫిర్యాదుదారు ఆరోపించారు. దీంతో మొగిలి అక్కడికక్కడే స్పృహ కోల్పోయినట్లు తెలిపారు. ఇతరులు జోక్యం చేసుకోవడంతో శివ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు.

వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది మొగిలిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపారు.

తన భర్త మొగిలి మృతికి అల్లుడు శివ సుత్తితో తలపై కొట్టడమే కారణమని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. నిందితుడిపై



చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వైయస్సార్ నగర్ లోని నిరుపేదలకు అండగా ఉంటాం



- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

**కాజీపేట్ ఆగస్టు 24 ( తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట్ నగరంలోని వైయస్సార్ నగర్ గుడిసెలలో నివసిస్తున్న నిరుపేద ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు . కాజీపేట్ లోనీ వైయస్సార్ నగర్ ను సోమవారం వినయ్ భాస్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కోట్ల విలువైన వైయస్సార్ నగర్ భూమి పై కొందరు కన్నేసి కబ్జా చేయాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. వైయస్సార్ నగర్ కాలనీలో గత 20 సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని వారిని కొందరు బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం కొనసాగిస్తున్నారని వారిని అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. అక్కడి నిరుపేదలకు తమ పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుంది అని భరోసా ఇచ్చారు. షాపూర్ ఇరానీ కుటుంబ సభ్యుల మంటూ కొందరు వచ్చి ఈ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని ఆ భూమిపై కన్నేసిన కాంగ్రెస్ నాయకులు, వారి అనుచరులు పేద ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. నిరుపేదలు ఇక్కడ 2005 నుంచి గుడిసెలు వేసుకొని జీవనం కొన్నిసాగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎస్ ఎస్ ఎస్ కాంప్లెక్స్ భూమిపై కోర్టులో కేసులో ఉన్నదనీ తెలిసిన కాంప్లెక్స్ కు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ఓసి నీ ఇచ్చిందన్నారు. కొంతమంది భూమిని దొంగ పేపర్లు పుట్టించి తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇటీవల వచ్చిన కోర్టు తీర్పుల్లో ఆ భూమి ముమ్మాటికి ప్రభుత్వ స్థలంగా భావించవచ్చు అని ఆయన తెలిపారు. ఈ కాలనీలో నివాసం ఉంటున్న వారికి ఇంటి నెంబర్లు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్ లు వచ్చాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు డబుల్ బెడ్ రూమ్ ఇప్పిస్తామని చెప్పి ఇల్లు ఖాళీ చేయాలని ప్రయత్నం చేసే క్రమంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్ కు వెళ్లి కంప్లైంట్ చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని కంప్లైంట్ ఇచ్చిన వారిపైనే స్థానిక పోలీసులు కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ పేదల పక్షాన ఉండి పోరాటం చేస్తుందన్నారు పేద ప్రజల కోసం అవసరమైతే సుప్రీంకోర్టు వరకు ఈ విషయాన్ని తీసుకెళ్తామన్నారు. ఇప్పటికే ఈ భూమి కోసం దాదాపు 30 కోట్ల రూపాయలు చేతులు మారాయి అని ఆయన ఆరోపించారు. గతంలో ఎన్నికల సమయంలో రైల్వే రిటైర్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రభుత్వ భూమిని కేటాయిస్తే మా పైన కేసులు నమోదయ్యాయని ఆ కేసులను కోర్టు కొట్టి వేసిందని ఆయన వివరించారు. ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అక్కడే ఇల్లు కట్టించి ఇచ్చి మిగిలిన భూమిలో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు ,మాజీ కార్పొరేటర్లు, రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఓటర్ల సవరణలపై బీఎల్ఓలకు అవగాహన



- మండలంలో 9,967 సవరణలు.. 1,381 అన్‌మ్యాపింగ్ నోటీసులు

**పెద్దమందడి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి తహసిల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలకు) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసిల్దార్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓటర్ల జాబితాలో గుర్తించిన సవరణలు అన్‌మ్యాపింగ్ నోటీసులపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు.మండల పరిధిలో మొత్తం 9,967 సవరణలు గుర్తించినట్లు తహసిల్దార్ మల్లికార్జున్ తెలిపారు. ఓటర్ల పేరు, తండ్రి/భర్త/తల్లి పేరు, వయస్సు తదితర వివరాల్లో ఉన్న వ్యత్యాసాలను బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. 2002 ఎస్ ఐ ఆర్ ఓటరు జాబితా, ప్రస్తుత 2026 ఓటరు జాబితాలోని వివరాలను పరిశీలించి తేడాలు ఉన్నచోట నిబంధనల ప్రకారం సవరణలు చేపట్టాలన్నారు.స్పెల్లింగ్‌లో తేడాలు, ఇంటిపేరు మార్పులు లేదా లేకపోవడం, వయస్సులో వ్యత్యాసాలు తదితర అంశాలను పరిశీలించి, సంబంధిత ఓటరు నుంచి అవసరమైన వివరాలు, ఆధారాలను సేకరించి బీఎల్ఓ ధ్రువీకరణ పత్రం ద్వారా నిర్ధారించాలని సూచించారు. ధ్రువీకరణ పూర్తయిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని తెలిపారు.అదేవిధంగా మండలం మొత్తం 1,381 అన్‌మ్యాపింగ్ నోటీసులు వచ్చినట్లు తహసిల్దార్ పేర్కొన్నారు. వీటిపై కూడా బీఎల్ఓలు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, సంబంధిత ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు బీఎల్ఓలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తహసిల్దార్ మల్లికార్జున్ సూచించారు.

# సురవరం ప్రతాప్‌రెడ్డి పార్కులో ఇతర నిర్మాణాలు చేపట్టవద్దు

- ప్రజావాణిలో కలెక్టర్ కు కౌన్సిలర్ ఏర్వ అరుణ శ్రీనివాసులు వినతి

**వనపర్తి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న సురవరం ప్రతాప్‌రెడ్డి పార్కులో నిబంధనలకు విరుద్ధంగా ఇతర నిర్మాణాలు చేపట్టవద్దని కోరుతూ 22వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ శ్రీనివాసులు సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతి పత్రం అందజేశారు.వనపర్తి తొలి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసిన స్థలంలో పార్కును ఏర్పాటు చేశారని కౌన్సిలర్ తెలిపారు. పార్కు ఏర్పాటుకు సంబంధించి 2020 సెప్టెంబర్ 30న అప్పటి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసిందని పేర్కొన్నారు. పార్కు ముందు భాగంలో బస్ షెల్టర్ కూడా ఉండటంతో ప్రయాణికులు సేదతీరేందుకు, స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఈ పార్కు ఉపయోగకరంగా ఉందన్నారు.ప్రస్తుతం పార్కు స్థలంలో ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను వార్డు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అరుణ శ్రీనివాసులు తెలిపారు. పార్కు ఉద్దేశాన్ని దెబ్బతీసే విధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



సురవరం ప్రతాప్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన పార్కును యథావిధిగా కొనసాగిస్తూ, ఆయన గౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం ప్రతిని కలెక్టర్‌కు అందజేశారు. పార్కు స్థలాన్ని ప్రజల వినియోగానికే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# కర్నె తండా లిఫ్ట్ ప్రారంభోత్సవానికి హాజరైన పెద్దమందడి కాంగ్రెస్ నాయకులు

**పెద్దమందడి,ఆగస్టు24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలంలోని కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్దమందడి మండల కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి తదితరుల సమక్షంలో కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పంపుల ప్రారంభోత్సవం జరిగింది. రూ.87.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో 4,235 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈ సందర్భంగా పెద్దమందడి కాంగ్రెస్ కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ.. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి, వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్, ఉప సర్పంచ్ ఉషన్న, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రఘు, కురుమూర్తి, నాగన్న, చిన్న మన్యం మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కారులో మృతదేహం కలకలం.. నిందితుడిని పట్టుకున్న పోలీసులు

**ఎల్కతుర్తి, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్ సమీపంలోని గల్లీలో కారులో మహిళ మృతదేహం లభించిన ఘటన కలకలం రేపింది. ఈ కేసులో నిందితుడిని ఎల్కతుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 21న కారులో నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ అక్కడికి వెళ్లి పరిశీలించగా, కారు డిక్కీలో సుమారు 25 నుంచి 35 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ మృతదేహం కనిపించింది.

ఫిర్యాదు మేరకు ఎల్కతుర్తి పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.



ఈ క్రమంలో ఆదివారం ఎల్కతుర్తి గ్రామ శివారులోని నాగార్జున సీడ్స్ ప్రాసెస్ ప్లాంట్ వద్ద విశ్వసనీయ సమాచారంతో గస్తీ నిర్వహిస్తున్న ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు ఏడెల్లి వినోద్ కుమార్ (34), తండ్రి సమ్మిరెడ్డి, ఎల్కతుర్తి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగిగా గుర్తించారు.

మహిళ హత్య వెనుక స్నేహం.. పోలీసుల విచారణలో వెలుగులోకి

పోలీసుల విచారణలో మృతురాలు మానస తనకు చిన్ననాటి స్నేహితురాలని వినోద్ కుమార్ వెల్లడించినట్లు తెలిపారు. కరీంనగర్‌లోని తన గదిలో వివాహం చేసుకోవాలని మానస కోరడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మానస తండ్రి అంకతి రాజేశంతో నిందితుడు ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడైంది.

మానస తమను ఇబ్బంది పెడుతోందని, ఆమెను ఏదైనా చేయాలని చెప్పడంతో నిందితుడు మానసను గొంతు నులిమి హత్య చేసినట్లు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని కారులో తీసుకొచ్చి ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్ సమీపంలో పార్క్ చేసినట్లు వెల్లడైంది.

నిందితుడు వినోద్ కుమార్‌ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ విట్టల్‌రావు, కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, అఖిల్, బక్కయ్య, సుమన్, నిరంజన్, మోహన్‌బాబు, రాంలాల్, నీరజ్‌లను ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

# ఘన్ముక్ల పాఠశాలపై అధికారుల దృష్టి

- మూసివేత ఆదేశాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన..
- గ్రామస్థుల అభిప్రాయాలు సేకరించిన అదనపు కలెక్టర్

**వీణవంక, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**విద్యార్థుల సంఖ్య తగ్గడంతో కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని ఘన్ముక్ల ప్రభుత్వ పాఠశాలను మూసివేయాలన్న ఆదేశాల నేపథ్యంలో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో దృష్టి సారించింది. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ హరిప్రసాద్ సోమవారం పాఠశాలను సందర్శించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతోంది? ఇందుకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై అదనపు కలెక్టర్ ఆరా తీశారు. గ్రామ సర్పంచ్ శంకర్‌తో పాటు గ్రామస్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, పాఠశాలకు సంబంధించిన వివరాలను సేకరించారు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక రూపొందించనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రస్తుత పరిస్థితిపై పూర్తి వివరాలతో నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని అదనపు కలెక్టర్ హరిప్రసాద్ వెల్లడించారు. నివేదిక పరిశీలించిన అనంతరం పాఠశాల విషయంలో తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

పాఠశాల మూసివేత అంశంపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన జరగడంతో గ్రామస్థుల్లో ఆసక్తి నెలకొంది. విద్యార్థుల భవిష్యత్తు, పాఠశాల కొనసాగింపు అంశంపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై స్థానికులు ఎదురుచూస్తున్నారు.



# శరణుఘోషలతో మారుమోగిన అయ్యప్ప ఆలయం





**జమ్మికుంట టౌన్ ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అయిత యుగేందర్-అనురాధ దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న వారి కుమార్తె, అల్లుడు గంది నిఖిల్ తేజ్-నేత్రి దంపతులతో పాటు మనవళ్లు ఆరుష్, అనీష్‌లకు శ్రీ అయ్యప్పస్వామి సంపూర్ణ కృపాకటాక్షాలు లభించాలని, ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.

శరణుఘోషలతో మారుమోగిన ఆలయం

పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో దీక్షాధారులైన అయ్యప్ప స్వాములకు భక్తిశ్రద్ధలతో మహాభిక్ష ఏర్పాటు చేశారు. స్వాముల భజనలు, 'స్వామియే శరణం అయ్యప్ప' శరణుఘోషలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో మారుమోగింది. కార్యక్రమంలో అయిత మోహన్, దివ్యతో పాటు స్థానిక ప్రముఖులు, భక్తులు, అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి విచ్చేసిన స్వాములందరికీ అయిత యుగేందర్-అనురాధ దంపతులు స్వయంగా భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం స్వాముల ఆశీస్సులు అందుకున్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి.. ఆచూకీ కోసం పోలీసుల ప్రయత్నం



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గత వారం రోజులుగా గ్రామంలో తిరుగుతూ ప్లాస్టిక్ సామగ్రిని సేకరిస్తూ, దొరికిన ఆహారం తింటూ జీవిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న పాడుబడిన హోటల్‌లో రాత్రివేళ నిద్రించేవాడని చెప్పారు.

ఆ వ్యక్తి ఆదివారం (ఆగస్టు 23) పాడుబడిన హోటల్‌లో మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి ఎడమ చేతిపై 'ఏయూ' అక్షరాలతో టాటూ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతడిని గుర్తుపట్టిన వారు సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

మృతుడి వివరాలు గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ సమాచారాన్ని ప్రజలకు చేరేలా ప్రచురించాలని పోలీసు అధికారులు పాత్రికేయ మిత్రులను కోరారు.

# జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



- **అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటాం**
- **ఇళ్ల పట్టాల సమస్యకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం: వొడితల ప్రణవ్**

**హుజురాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని, వారి ఇళ్ల పట్టాలకు సంబంధించిన సమస్యలను న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని వొడితల ప్రణవ్ సందర్శించారు. దీక్ష చేస్తున్న జర్నలిస్టులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. అనంతరం జర్నలిస్టులకు నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేశారు.

ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా ఇచ్చిన జర్నలిస్టుల ఇళ్ల పట్టాల విషయంలో భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ప్రణవ్ హామీ ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాలపై విద్యార్థులకు అవగాహన



- **వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సిపీబీఫ్ఐ కోర్సు పరిచయ కార్యక్రమం**

**హుజురాబాద్,ఆగష్టు 24(తెలంగాణ ముచ్చట్లు ):**సింగాపూర్, హుజూరాబాద్: విద్యార్థుల కెరీర్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సిపీబీఫ్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్) కోర్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రుబికాన్ ఫౌండేషన్, బజాజ్ ఫిన్‌సర్వ్ సీనియర్ ట్రైనర్ అభిషా బ్లెస్సీ విద్యార్థులకు కోర్సు ప్రాముఖ్యత, శిక్షణ విధానం, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ రంగాల్లో ఉన్న కెరీర్ అవకాశాలపై వివరించారు.

120 గంటల శిక్షణా కార్యక్రమంగా రూపొందించిన సిపీబీఫ్ఐ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తారని తెలిపారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థుల్లో ఆర్థిక సేవల రంగంపై అవగాహనతో పాటు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందుతాయని వివరించారు.

విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాన్ని కళాశాల యాజమాన్యం ముందుచూపుతో చేపట్టడంపై అభినందనలు వ్యక్తమయ్యాయి. త్వరలోనే కళాశాలలో సిపీబీఫ్ఐ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు కూడా కార్యక్రమంపై ఆసక్తి కనబరుస్తూ చురుగ్గా పాల్గొన్నారు.





# విద్యాభివృద్ధికి చేయూత.. అంగన్‌వాడి చిన్నారులకు కానుకలు

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు స్లేట్లు, స్లేట్ పెన్సిళ్లను 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ సోమవారం పంపిణీ చేశారు. అంగన్‌వాడి విద్యార్థులు, చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేసి వారి విద్యాభివృద్ధికి ప్రోత్సాహం కల్పించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ 6వ వార్డు అభివృద్ధికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సహకారంతో అవసరమైన వారికి తమకు తోచిన విధంగా ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ శారద, ఆయా, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.






# మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

- **గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 27 మందికి చీరలు**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చీరలు పంపిణీ చేశారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 27 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ట్రస్ట్ నిర్వాహకులు, సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్, కమిషనర్ గుట్టల మల్లికార్జున్ చేతుల మీదుగా చీరలు అందజేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా రిటైర్ అయిన అనంతరం తన తల్లి పేరుతో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, తన పెన్షన్ డబ్బులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, సమాజంలోని పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ సేవాభావం అభినందనీయమన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసినందుకు ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని, వాటికి తమ సహకారం ఉంటుందని పేర్కొన్నారు.

ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి వెన్నెముక లాంటి వారని అన్నారు. ప్రతిరోజూ ఉదయం వీధులు, డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తూ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందిస్తున్న వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు.

కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గుర్రం కావ్య పరశురాములు, శీలం శ్రీనివాస్, కొల్లూరి సురేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్ష్మణమూర్తి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లను ప్రశ్నించే ముందు అసమానతలను ప్రశ్నించాలి

- **రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ**
- **జమ్మికుంటలో మాదిగ హక్కుల దండోరా జిల్లా సమావేశం..**



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో కుల వివక్ష, సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోకముందే రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేయడం సామాజిక న్యాయాన్ని తిరస్కరించడమేనని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ అన్నారు. ఆదివారం జమ్మికుంటలో నిర్వహించిన జిల్లా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలపై తీవ్రంగా స్పందించారు.

రిజర్వేషన్లు ఎవరి దయతో వచ్చినవి కావని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని శంకర్ మాదిగ స్పష్టం చేశారు. కుల వివక్షను నిర్మూలించకుండా రిజర్వేషన్లను తొలగించాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలను ప్రజలు అప్రమత్తంగా గమనించాలని, అన్ని వర్గాలు ఐక్యంగా నిలిచి సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా జరిగే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పుకుంటున్నప్పటికీ పేదలకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, ఆర్థిక భద్రత వంటి ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఎందుకు అందడం లేదని ఆయన ప్రశ్నించారు. లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లో ప్రజల సంక్షేమానికి ఎంత నిధులు ఖర్చవుతున్నాయో ప్రభుత్వాలు స్పష్టమైన లెక్కలు ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వానికి ప్రశ్నల వర్షం

దళితుల అభివృద్ధి కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని సబ్సిడీ రుణాలు అందించింది, ఎంతమంది దళిత యువతకు స్వయం ఉపాధి కల్పించింది, ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎంతమేర నిధులు విడుదలయ్యాయి అనే పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని శంకర్ మాదిగ డిమాండ్ చేశారు.

దళితుల పేరుతో బడ్జెట్‌లో నిధులు కేటాయించడం మాత్రమే కాకుండా, ఆ నిధులు దళిత కుటుంబాల జీవితాల్లో ఎంతమేర మార్పు తీసుకొచ్చాయో ప్రభుత్వం చూపించాల్సిన అవసరం ఉందన్నారు. దళిత యువతకు రుణాలు, ఉపాధి, విద్య, భూమి, వ్యాపార అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హక్కుల పరిరక్షణ కోసం నిరంతర పోరాటం

రిజర్వేషన్ల పరిరక్షణతో పాటు దళితుల హక్కులు, ఆత్మగౌరవం, ఆర్థిక సాధికారత కోసం మాదిగ హక్కుల దండోరా నిరంతరం పోరాడుతుందని శంకర్ మాదిగ స్పష్టం చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేసే శక్తులను ఎదుర్కొనేందుకు తెలంగాణ నుంచి మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల కుమారస్వామి మాదిగ, రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్ మాదిగ, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డే రాజేందర్ మాదిగ, మోతె స్వామి మాదిగ, మందమర్రి పట్టణ అధ్యక్షుడు కొలుగూరి విజయ్‌కుమార్ మాదిగ, ఇల్లందు మండల అధ్యక్షుడు స్వామిదాస్ మాదిగ, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు దొడ్డే రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదం కేసులో ఐదుగురికి ఐదేళ్ల జైలు

- **ఆరేళ్ల విచారణకు తెర..**
- **ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించిన హుజూరాబాద్ కోర్టు**



**ఇల్లందకుంట, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం గడ్డివానిపల్లిలో 2019లో చోటు చేసుకున్న భూ వివాదం కేసులో హుజూరాబాద్ కోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురిని దోషులుగా నిర్ధారించిన కోర్టు వారికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించింది.

గడ్డివానిపల్లికి చెందిన ఎలవేని రఘుపతి సుమారు 35 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన 18 గుంటల భూమిని ఆయన తండ్రి తమకు తెలియకుండా విక్రయించారనే ఆరోపణల నేపథ్యంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గడ్డి మహేష్ (ఉపసర్పంచ్), గడ్డి కొమురయ్య, గడ్డి రాజు, గడ్డి తిరుపతి, సిరిసేడు గ్రామానికి చెందిన బీనవేని ఎర్రయ్యలు రఘుపతిపై దాడి చేసినట్లు కేసు నమోదైంది. దాడిలో తీవ్రంగా గాయపడిన రఘుపతిని కుటుంబ సభ్యులు తొలుత జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై రఘుపతి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇల్లందకుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరేళ్ల విచారణ అనంతరం తీర్పు

కేసు ఆరేళ్ల పాటు కోర్టులో విచారణ కొనసాగింది. సాక్ష్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం హుజూరాబాద్ కోర్టు ఐదుగురినీ దోషులుగా నిర్ధారిస్తూ ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించింది.

కేసు విచారణ సందర్భంగా కోర్టు వాయిదాలకు ఇరువర్గాలను హాజరుపరచడంలో విధులు నిర్వర్తించిన కోర్టు కానిస్టేబుల్ జన్నే రాజేష్‌ను హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట రూరల్ సీఐ వెంకట్‌గౌడ్, ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్ అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఫీజు బకాయిలపై కరీంనగర్‌లో బీజేపీ పోరుబాట

- **రూ.15 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్**

**కరీంనగర్,ఆగష్టు 24(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్ బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం బకాయిల చెల్లింపుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఫీజులు చెల్లించలేక పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం తగదని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

విద్యార్థుల హక్కుల కోసం దీక్ష

విద్యార్థుల హక్కుల సాధన కోసం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు దీక్ష చేపట్టారని నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సదరం సర్టిఫికెట్ కోసం ఏడాదిగా ఎదురుచూపులు

- **నిమ్స్‌లో ధ్రువీకరణ.. కరీంనగర్‌లో సర్టిఫికెట్‌కు నిరాకరణ?**



**తిమ్మాపూర్, ఆగస్టు 24(తెలంగాణ ముచ్చట్లు ):** జన్యులోపంతో నడవలేని స్థితిలో ఉన్న తిమ్మాపూర్ మండలానికి చెందిన బాలుడు అడిచర్ల ప్రసాద్‌కు సదరం సర్టిఫికెట్ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా ఇప్పటికీ సర్టిఫికెట్ జారీ కాలేదని అతని తండ్రి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై అధికారులకు తన కుమారుడి సమస్యను వివరించారు. తన కుమారుడు జన్యులోపంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడని, హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యులు ఇప్పటికే వైద్యపరంగా ధ్రువీకరించారని శ్రీనివాస్ తెలిపారు. నిమ్స్ వైద్యుల ధ్రువీకరణ ఉన్నప్పటికీ కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం సదరం సర్టిఫికెట్ జారీ చేయడం లేదని ఆయన వాపోయారు. సదరం సర్టిఫికెట్ కోసం గత ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని, ప్రతిసారి ఆసుపత్రికి వెళ్లినా ఇబ్బందులు ఎదురవుతున్నాయని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ లేకపోవడంతో తన కుమారుడికి అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న పలు ప్రయోజనాలు పొందలేకపోతున్నామని తెలిపారు. తన కుమారుడి పరిస్థితిని అధికారులు మానవతా దృక్పథంతో పరిశీలించి, నిమ్స్ వైద్యుల ధ్రువీకరణను పరిగణనలోకి తీసుకుని సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని శ్రీనివాస్ కోరారు. సమస్యను త్వరగా పరిష్కరించి తన కుమారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో అధికారులను విజ్ఞప్తి చేశారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- **రూ.12 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**
- **వరుస చోరీల కేసుల్లో కీలక పురోగతి**

**వరంగల్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను మిల్స్ కాలనీ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 70.19 గ్రాముల బంగారు ఆభరణాలు, 527.9 గ్రాముల వెండి వస్తువులు, రూ.29,875 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు చోరీ కేసుల దర్యాప్తులో ఈ కీలక పురోగతి సాధించినట్లు పోలీసులు తెలిపారు. వరుస చోరీల నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టారు. గతంలో జరిగిన చోరీల తీరును విశ్లేషించి అనుమానితుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు సోమవారం ఉదయం ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు చోరీలకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం ఆశిష్ శ్రీనివాస్ రెడ్డిమల్ల (27) పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. ప్రస్తుతం మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రపూర్‌లో నివసిస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. పగటి సమయంలో ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి, రాత్రివేళల్లో చోరీలకు పాల్పడటం అతని నేర పద్ధతిగా పోలీసులు గుర్తించారు. నిందితుడిని వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద మిల్స్ కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి చోరీ చేసిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శివనగర్, ఎస్ఆర్ఆర్ నగర్ ప్రాంతాల్లో జరిగిన పలు ఇంటి చోరీలలో నిందితుడి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు.





# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిస్థితిపై మున్సిపల్ చైర్మన్ ఆరా

- **పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్**

**జమ్మికుంట, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**జమ్మికుంట పట్టణ పరిధిలోని కేశవపురం కస్తూరిబా పాఠశాల సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సోమవారం కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పరిస్థితి, పెండింగ్ పనులు, లబ్ధిదారులకు అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణానికి గత ప్రభుత్వం 500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా ఇళ్ల పంపిణీపై లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. అయితే నిర్మాణం పూర్తికాని ఇళ్లను కూడా పూర్తయినట్లుగా చూపిస్తూ ప్రజలను అయోమయానికి గురిచేయడం సరికాదన్నారు.

కస్తూరిబా పాఠశాల సమీపంలో సుమారు 240 ఇళ్లు ఉన్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం కేవలం 24 ఇళ్లు మాత్రమే నివాసయోగ్యంగా ఉన్నాయని చైర్మన్ తెలిపారు. మిగిలిన ఇళ్లలో కొన్ని పునాది దశలో, మరికొన్ని పిల్లర్ల దశలో ఉండగా, కొన్ని ఇళ్లలో ఒక అంతస్తు నిర్మించి మరో అంతస్తు పనులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. నిర్మాణ ప్రాంతంలోని సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో కొన్ని ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు.

ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో, ముందుగా ఆయా ఇళ్ల నిర్మాణ పరిస్థితిని లబ్ధిదారులతోనే పరిశీలింపజేయాలని కోరారు. అవసరమైన నిధులు కేటాయించి పెండింగ్ నిర్మాణ పనులను పూర్తి చేసి ఇళ్లను నివాసయోగ్యంగా మార్చిన తర్వాతే పంపిణీ చేపట్టాలని సూచించారు.

రాజకీయ విమర్శలు తమకు అవసరం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడమే ముఖ్యమని చైర్మన్ పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో ప్రజలను పదేపదే ఆశలు పెట్టి నిరీక్షించేలా చేయకుండా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ శాఖ అధికారులను కోరారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి సమాచారం సేకరించి, పెండింగ్ పనులకు అవసరమైన నిధులు కేటాయించి ఇళ్లను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్, కొలుగూరి సురేష్, ఫిరోజ్, మైస రవి, పరశురామ్, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ భూములపై బీఆర్ఎస్ ధర్నా

- **నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి: బీఆర్ఎస్**
- **రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్**




**కరీంనగర్,ఆగష్టు 24(తెలంగాణ ముచ్చట్లు ):** రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల్లోని పలు సర్వే నంబర్ల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూములను వెంటనే 22ఏ నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

ధర్నాలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొని ఆందోళనకారులతో కలిసి కూర్చున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ 22ఏ జాబితాలో చేర్చిన భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల్లో ఏళ్లుగా ప్రజల ఆధీనంలో ఉన్న భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. భూముల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు జరగకపోవడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత రికార్డులను పరిశీలించి అర్హమైన భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# డీఏవీ జాతీయ క్రీడలకు 28 మంది ఎంపిక





**సత్తుపల్లి, ఆగస్టు 24(తెలంగాణ ముచ్చట్లు):** బి.గంగారంలోని సాయి స్ఫూర్తి డీఏవీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటారు. ఈ నెల 22, 23 తేదీల్లో బీడీఎల్ భానూర్‌లోని డీఏవీ పాఠశాలలో జరిగిన పోటీల్లో పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొనగా 28 మంది డీఏవీ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. చెస్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 17 బాలికల చెస్‌లో ప్రథమ స్థానం, అండర్ 19 బాలుర వాలీబాల్‌లో ప్రథమ స్థానం, అండర్ 19 బాలుర కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు. అథ్లెటిక్స్‌లోనూ పలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. అండర్ 17 బాలికల షాట్‌పుట్‌లో గౌరి ప్రియా, బాలుర షాట్‌పుట్‌లో వివేక్ వర్ధన్, అండర్ 14 బాలికల 800 మీటర్ల పరుగులో నైనిషా, అండర్ 17 బాలుర 400 మీటర్ల పరుగులో లిబిల్ ప్రథమ స్థానాలు సాధించారు. అండర్ 14 బాలికల 400 మీటర్ల పరుగులో అక్షర కె., అండర్ 17 బాలికల 100 మీటర్ల పరుగులో లాస్యారెడ్డి తృతీయ స్థానాలు పొందారు. లాంగ్‌జంప్‌లో అక్షర ఎం., పి.దీక్షిత్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అండర్ 19 బాలుర షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో జి.కె.జి. గౌతమ్ ప్రథమ స్థానాలు సాధించాడు. డిస్కస్‌త్రోలో వివేక్ వర్ధన్, వై. గౌరిప్రియా ప్రథమ స్థానాల్లో నిలిచి బహుళ స్వర్ణ పతకాలు సాధించారు. విద్యార్థుల కృషిని పాఠశాల ప్రిన్సిపాల్ తణుకు శేషసాయిశ్రీ అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, సమిష్టి కృషి అభినందనీయమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.కుమారస్వామి, ఎం.రామ్‌శెట్టి, బి.శ్యామ్‌కుమార్‌లను, విజేతలను పాఠశాల హానరరీ చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, డీఏవీ ఏపీ జోన్‌ఎ రీజనల్ ఆఫీసర్ జి.ఆర్.కె.ప్రసాద్, చైర్మన్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి బండి అన్విద అభినందించారు. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు హర్షం

# ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం.!

- **వార్డెన్ రమేష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు.**



**సత్తుపల్లి, ఆగస్టు 24(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వార్డెన్ రమేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. శిబిరంలో విద్యార్థుల ఆరోగ్య సమస్యలను వైద్యులు అడిగి తెలుసుకుని అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య పరిస్థితిని బట్టి తగిన వైద్య సలహాలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా అనారోగ్య తీవ్రతను తగ్గించవచ్చని వైద్యులు సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవన విధానం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. అవసరమైన విద్యార్థులను తదుపరి వైద్య పరీక్షలు, చికిత్స కోసం ఆసుపత్రులకు రిఫర్ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వార్డెన్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులోనూ మరిన్ని ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం పట్ల విద్యార్థులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది మరియు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం - 25- ఆగస్టు 2026




# తాగునీటి భద్రతపై రైల్వేల ప్రత్యేక దృష్టి

- **తాగునీటి ట్యాంకులు, ఫిల్టర్ల శుభ్రతకు ప్రత్యేక కార్యక్రమం**
- **స్టేషన్లలో మౌలిక సదుపాయాల సమగ్ర తనిఖీలకు ఆదేశాలు**
- **ప్రయాణికులకు నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

భారతీయ రైల్వేలు ప్రయాణికులకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్లలో ఉన్న తాగునీటి ట్యాంకులు, వాటర్ ఫిల్టర్లను పూర్తిస్థాయిలో శుభ్రపరచడం, క్రిమిసంహారక చర్యలు చేపట్టడం జరుగుతోంది. తాగునీటి నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ చర్యలు కీలకంగా నిలవనున్నాయని రైల్వే శాఖ తెలిపింది. దేశంలోని అన్ని జోనల్ రైల్వేలకు ఈ మేరకు ప్రత్యేక ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతి స్టేషన్‌లో తాగునీటి సరఫరా వ్యవస్థ, నిల్వ ట్యాంకులు, ఫిల్టరేషన్ యంత్రాలు, పైపులైన్ల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వాటిని వెంటనే సరిచేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

వర్షాకాల నేపథ్యంలో తాగునీటి కాలుష్య ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రైల్వే స్టేషన్లలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు తాగునీటిని వినియోగిస్తున్నందున పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి స్టేషన్‌కు సంబంధించిన లోపాలు, వాటి పరిష్కార చర్యలను ప్రత్యేకంగా నమోదు చేసి పర్యవేక్షించాలని జోనల్ అధికారులకు సూచించారు. స్టేషన్ వారీగా చేపట్టిన చర్యలపై నిరంతర సమీక్ష నిర్వహించి తాగునీటి సదుపాయాలను మెరుగుపర్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

తాగునీటి ట్యాంకుల శుభ్రపరిచే ప్రక్రియతో పాటు ఫిల్టర్ల పనితీరు, నీటి నాణ్యత పరీక్షలు కూడా నిర్వహించనున్నారు. అవసరమైన చోట్ల పాత పరికరాలను మార్చి కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో తాగునీటి సదుపాయాలను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం లక్ష్యమని రైల్వే శాఖ వెల్లడించింది. శుభ్రత, భద్రత, నాణ్యత అంశాల్లో రాజీ లేకుండా చర్యలు కొనసాగుతాయని తెలిపింది.




## ప్రముఖ రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి మృతి

- **రైతు ఉద్యమానికి తీరని లోటు.. జీవితాంతం ప్రజా పోరాటాలు.**

**సత్తుపల్లి, ఆగస్టు 24(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రముఖ రైతు నేత, సీపీఎం సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ కార్యదర్శివర్గ సభ్యుడు, అఖిల భారత కిసాన్ సభ మాజీ ఉపాధ్యక్షుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి (90) మృతి పట్ల సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ, తెలంగాణ రైతు సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో మోరంపూడి పాండురంగారావు, రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో సారంపల్లి మల్లారెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. పేదలు, దళితుల భూముల పరిరక్షణ, భూసమస్యలు, సాగునీరు, వ్యవసాయ సంక్షోభం తదితర సమస్యలపై ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. సీపీఎం, రైతు సంఘాల నిర్మాణంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు ఆయన విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యలపై అనేక పుస్తకాలు రచించి ప్రజల్లో అవగాహన కల్పించిన మల్లారెడ్డి సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన మృతి వామపక్ష, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని, ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ సభ్యులు మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, మోరంపూడి గుదే రాము, వెంకటేశ్వరరావు, కాపా రమణ, చెరుకు శ్రీను, చెరుకు రత్నకుమారి, పుష్పవల్లి, భాస్కర్, సైదా రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సంతోష్, కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ తరం ఎటు వైపు.. ప్రభుత్వ చర్యలు తప్పనిసరి

- **కాలేజీ గేటు దాటిన విద్యార్థికి పుస్తకం కనిపించాలి.. సిగరెట్ కాదు.**
- **కాలేజీల చుట్టూ మద్యం, సిగరెట్లు, మత్తు పదార్థాలు, బెట్టింగ్‌లకు అడ్డుకట్ట వేయాలి.**
- **కె. రూపారెడ్డి దారుణ హత్య..**
- **విద్యార్థులు, యువతలో పెరుగుతున్న హింసాత్మక ధోరణులపై ఆందోళన.**

**సత్తుపల్లి, ఆగస్టు 24(తెలంగాణ ముచ్చట్లు):**



పెన్ను పట్టాల్సిన చేతులు కత్తులు పట్టడం.. చదువుకోవాల్సిన వయసులో మద్యం, సిగరెట్లు, మత్తు పదార్థాలకు అలవాటు పడటం.. క్రీడలను ఆస్వాదించాల్సిన యువత బెట్టింగ్‌ల వైపు ఆకర్షితులు కావడం.. కాలేజీకి వెళ్లే వయసులో అతివేగంగా బైక్‌లు నడపడం.. సోషల్ మీడియాకు గంటల తరబడి బానిసలుగా మారడం.. గురువుల పట్ల గౌరవం తగ్గడం.. ఇవన్నీ సమాజాన్ని ఆలోచింపజేస్తున్న పరిణామాలు. తాజాగా ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి దారుణ హత్యకు గురైన ఘటన విద్యాసంస్థల్లో భద్రత, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల పట్ల గౌరవం వంటి అంశాలపై మరోసారి ఆలోచించాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది. ఒకప్పుడు విద్యార్థి చేతిలో పెన్ను కనిపిస్తే.. ఆ చేతులు భవిష్యత్తును రాస్తాయని తల్లిదండ్రులు ఆశించేవారు. పుస్తకాలతో పాఠశాలకు, కళాశాలకు వెళ్లే పిల్లలను చూసి ఎన్నో కలలు కనేవారు. గురువు కనిపిస్తే గౌరవంగా తలవంచేవారు. ఇప్పుడు కొంతమంది యువతలో కనిపిస్తున్న ఆవేశం, గొడవలు, ప్రతీకార ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయి. దీనికి కుటుంబ వాతావరణం, స్నేహాలు, సోషల్ మీడియా ప్రభావం, పెంపకంలో మారుతున్న ధోరణులు వంటి అనేక కారణాలు ఉండొచ్చు. విద్యార్థులకు చదువుతో పాటు సహనం, సంయమనం, క్రమశిక్షణ, మానవతా విలువలు నేర్పాల్సిన అవసరం ఉంది. మద్యం, సిగరెట్లు, మత్తు పదార్థాల ప్రభావం యువత భవిష్యత్తుకు తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉంది. సరదాగా మొదలయ్యే అలవాటు క్రమంగా వ్యసనంగా మారవచ్చు. స్నేహితుల ప్రభావంతో కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. అందుకే కాలేజీల పరిసరాల్లో మద్యం, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలు సులభంగా లభించకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. పోలీసులు, ఎక్సైజ్, విద్యాశాఖ, స్థానిక సంస్థలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలి. కాలేజీ గేటు దాటిన విద్యార్థికి పుస్తకం కనిపించాలి.. సిగరెట్ కాదు. ఇదే సమయంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లు యువతను మరో ప్రమాదకర మార్గంలోకి తీసుకెళ్తున్నాయి. క్రీడలను ఆస్వాదించాల్సిన యువత ఎవరు గెలుస్తారు? ఎవరు ఓడిపోతారు? అనే అంచనాలతో డబ్బులు పెట్టడం ఆందోళనకరం. మొదట చిన్న మొత్తంతో మొదలై.. నష్టాన్ని పూడ్చుకునేందుకు మరింత డబ్బు పెట్టే పరిస్థితి ఏర్పడవచ్చు. చివరకు అప్పులు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలకు దారితీసే అవకాశం ఉంది. బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ జూదంపై సంబంధిత శాఖలు నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. కాలేజీ విద్యార్థుల్లో పెరుగుతున్న అతివేగ బైక్ ప్రయాణం కూడా ప్రమాదకరమే. వాహనం సౌకర్యం కోసం ఉండాలి తప్ప.. ప్రదర్శన కోసం కాదు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వేగాన్ని నియంత్రించడం వంటి విషయాలపై తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలి. సెల్‌ఫోన్, సోషల్ మీడియా కూడా యువత జీవితంలో భాగమయ్యాయి. వాటిని విద్య, విజ్ఞానం కోసం ఉపయోగిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. కానీ గంటల తరబడి రీల్స్, షార్ట్ వీడియోల్లో మునిగిపోవడం, లైక్స్, కామెంట్ల కోసం ఆరాటపడటం వల్ల విలువైన సమయం వృథా అవుతోంది. ఫోన్ చేతిలో ఉండాలి.. కానీ జీవితం ఫోన్ చేతిలో ఉండకూడదు. గురువు పట్ల గౌరవం తగ్గడం కూడా ఆందోళన కలిగించే అంశమే. గురువు చెప్పిన విషయాన్ని ప్రశ్నించడం తప్పు కాదు. కానీ ప్రశ్నించే పద్ధతిలో గౌరవం ఉండాలి. చదువు జ్ఞానాన్ని ఇస్తే.. సంస్కారం ఆ జ్ఞానాన్ని సరైన మార్గంలో ఉపయోగించడాన్ని నేర్పుతుంది. ప్రిన్సిపాల్ కె. రూపారెడ్డి దారుణ హత్య వంటి ఘటనలు విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతో ఉంది. పిల్లలకు అవసరమైన ప్రతి వస్తువు కొనివ్వడం కంటే వాటి విలువను తెలియజేయాలి. తప్పు చేసినప్పుడు సమర్థించడం కంటే సరిదిద్దాలి. పిల్లలతో స్నేహంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలి. ఎవరితో స్నేహం చేస్తున్నారు? కాలేజీ తర్వాత ఎక్కడికి వెళ్తున్నారు? డబ్బును ఎలా ఖర్చు చేస్తున్నారు? సోషల్ మీడియాలో ఏం చేస్తున్నారు? అనే విషయాలపై అవగాహన ఉండాలి. పిల్లలకు డబ్బు ఇవ్వడం కంటే డబ్బు విలువ నేర్పాలి. బైక్ ఇవ్వడం కంటే బాధ్యత నేర్పాలి. స్వేచ్ఛతో పాటు సంస్కారం నేర్పాలి. అయితే ఈ తరం మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు. చదువులో రాణిస్తున్న, క్రీడల్లో ప్రతిభ చూపుతున్న, సాంకేతిక రంగంలో ముందుకు వెళ్తున్న యువత ఎంతోమంది ఉన్నారు. యువతలోని శక్తిని సరైన దిశలో మళ్లిస్తే అది సమాజానికి గొప్ప బలంగా మారుతుంది. అందుకు ముందుగా యువత చుట్టూ ఉన్న వాతావరణాన్ని మార్చాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థల పరిసరాల్లో మద్యం, సిగరెట్లు, మత్తు పదార్థాలు, పొగాకు విక్రయాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు బెట్టింగ్, డ్రగ్స్ వంటి వాటిపై నిఘా పెంచాలి. విద్యార్థులకు క్రీడా మైదానాలు, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకురావాలి. పాఠశాలలు, కళాశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. అదే సమయంలో విద్యాసంస్థల్లో భద్రతా వ్యవస్థలను కూడా పటిష్ఠం చేయాలి. యువతను కాపాడటం అంటే వారు తప్పుదారి పట్టిన తర్వాత చర్యలు తీసుకోవడం మాత్రమే కాదు.. తప్పుదారి పట్టకుండా ముందుగానే మంచి వాతావరణం కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. కాలేజీ గేటు వద్దకు చేరుకున్న విద్యార్థికి పుస్తకాల దారి కనిపించాలి. బయటకు వచ్చినప్పుడు క్రీడా మైదానం, గ్రంథాలయం, మంచి స్నేహితుల వాతావరణం కనిపించాలి. మద్యం దుకాణం, సిగరెట్ షాపు, బెట్టింగ్ ప్రకటనలు కనిపించే పరిస్థితి ఉండకూడదు. పెన్ను పట్టాల్సిన చేతులు కత్తులు పట్టకూడదు.. చదువుకోవాల్సిన వయసులో మత్తుకు బానిసలు కాకూడదు.. క్రీడలను ఆస్వాదించాల్సిన యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి. ఈ తరం ఎటు వెళ్తుందో అని ప్రశ్నించడం కంటే.. ఈ తరాన్ని ఎటు నడిపిస్తున్నామో ఆలోచించాల్సిన సమయం ఇది. యువత భవిష్యత్తును కాపాడేందుకు కుటుంబం, విద్యాసంస్థలు, ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, సమాజం సమిష్టిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది.



# డిగ్రీ ఒక్కటే కాదు... నైపుణ్యమే అసలైన బలం

- **డిగ్రీతో పాటు నైపుణ్యాలకే డిమాండ్**
- **మారుతున్న ఉద్యోగ రంగం**
- **విజయానికి విద్య-స్కిల్స్ సమన్వయం**

**డెస్క్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉన్నత విద్య అనేది ప్రతి యువకుడి జీవితంలో కీలకమైన దశ. ఒకప్పుడు మంచి ఉద్యోగం పొందాలంటే డిగ్రీ లేదా పీజీ అర్హతలు ఉంటే సరిపోతుందని భావించేవారు. విద్యాసంస్థల నుంచి పట్టాలు పొందడం ఉద్యోగ జీవితానికి ప్రవేశ పత్రంలా పరిగణించబడేది. కానీ ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తోంది. పరిశ్రమల అవసరాలు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం డిగ్రీ ఉంటే సరిపోతుందా? లేక ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు కూడా ఉండాలా? అనే ప్రశ్న నేటి విద్యా వ్యవస్థ ముందున్న అతిపెద్ద చర్చగా మారింది. సాంప్రదాయ డిగ్రీ విద్యకు ఇప్పటికీ ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కళాశాలలు, విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు ఒక అంశంపై విస్తృత అవగాహన కల్పిస్తాయి. సిద్ధాంతపరమైన జ్ఞానం, పరిశోధనా దృక్పథం, విశ్లేషణ సామర్థ్యం వంటి అంశాలను అభివృద్ధి చేస్తాయి. వైద్యం, న్యాయశాస్త్రం, బోధన, శాస్త్రీయ పరిశోధన వంటి అనేక రంగాల్లో డిగ్రీలు తప్పనిసరి. అందువల్ల డిగ్రీ విద్య విలువ తగ్గిపోయిందని చెప్పడం సరైంది కాదు. అది ఇప్పటికీ విద్యార్థికి బలమైన పునాది అందించే సాధనంగానే కొనసాగుతోంది.

అయితే ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ కేవలం విద్యార్హతలను మాత్రమే చూడడం లేదు. ఒక అభ్యర్థి సమస్యలను ఎలా పరిష్కరిస్తాడు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంత సమర్థంగా ఉపయోగించగలడు, బృందంతో కలిసి పని చేయగలడా, కొత్త పరిస్థితులకు ఎంత త్వరగా అలవాటు పడగలడు వంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనేక సంస్థలు ఇప్పుడు మార్కుల కంటే నైపుణ్యాలను ముఖ్యంగా పరిగణిస్తున్నాయి. దీనివల్ల స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌కు డిమాండ్ గణనీయంగా పెరిగింది. నైపుణ్య ఆధారిత విద్య విద్యార్థులను నేరుగా ఉద్యోగ అవసరాలకు అనుసంధానిస్తుంది. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, కృత్రిమ మేధస్సు, డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైన్, డేటా విశ్లేషణ, యంత్రాల నిర్వహణ, సమాచార ప్రసార నైపుణ్యాలు వంటి అనేక రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తుంది. ఈ కోర్సులు సాధారణంగా ప్రాయోగిక అనుభవానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. ఫలితంగా విద్యార్థులు చదువు పూర్తయ్యే సమయానికే ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను సంపాదించగలుగుతున్నారు.

భారతదేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువకులు డిగ్రీలు పూర్తి చేస్తున్నారు. కానీ అందరికీ తగిన ఉద్యోగాలు లభించడం లేదు. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి విద్యా వ్యవస్థ మరియు పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరం. చాలామంది విద్యార్థులు సిద్ధాంతపరంగా మంచి ప్రతిభ కనబరిచినా, ఉద్యోగ రంగంలో అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి విద్యా విధానంలో మార్పుల అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ఇటీవలి కాలంలో అనేక సంస్థలు నియామకాల సమయంలో డిగ్రీ కంటే నైపుణ్య పరీక్షలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కొన్ని రంగాల్లో డిగ్రీ లేకపోయినా అసాధారణ నైపుణ్యాలు ఉన్నవారికి అవకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, సృజనాత్మక పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. ఇది యువతలో నైపుణ్యాల ప్రాముఖ్యతపై అవగాహనను పెంచుతోంది.

అయితే డిగ్రీ మరియు నైపుణ్యాలను పరస్పర ప్రత్యామ్నాయాలుగా చూడడం సరైన విధానం కాదు. రెండింటికీ సమాన ప్రాధాన్యం ఉంది. డిగ్రీ ఒక వ్యక్తికి విజ్ఞాన పునాది అందిస్తే, నైపుణ్యాలు ఆ విజ్ఞానాన్ని కార్యరూపంలోకి తీసుకెళ్లే సామర్థ్యాన్ని కల్పిస్తాయి. పునాది బలంగా ఉండి, దానిపై నైపుణ్యాల భవనం నిర్మించినప్పుడే వ్యక్తి పూర్తి స్థాయి వృత్తి నిపుణుడిగా ఎదగగలడు. విద్యాసంస్థలు కూడా కాలానుగుణంగా మారాల్సిన అవసరం ఉంది. సంప్రదాయ బోధనతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణను అందించాలి. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ప్రాయోగిక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యలో అంతర్భాగంగా మారాలి. విద్యార్థులు కూడా పరీక్షల కోసం మాత్రమే కాకుండా జీవిత నైపుణ్యాల కోసం నేర్చుకునే దృక్పథాన్ని పెంపొందించుకోవాలి.

తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేస్తేనే విద్య మరియు ఉపాధి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించవచ్చు. యువతలో సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించడం అత్యవసరం. ఇవే భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌లో విజయానికి కీలకంగా మారనున్నాయి. మొత్తంగా చూస్తే ఉద్యోగ అవకాశాల కోసం కేవలం సర్టిఫికెట్ ఒక్కటే సరిపోదు. అలాగే నైపుణ్యాలే చాలు అని కూడా చెప్పలేం. డిగ్రీ అందించే జ్ఞానం, నైపుణ్యాలు అందించే సామర్థ్యం రెండూ కలిసినప్పుడే యువత భవిష్యత్‌ను విజయవంతంగా నిర్మించుకోగలుగుతుంది. అందుకే నేటి విద్యా వ్యవస్థ లక్ష్యం డిగ్రీలను అందించడం మాత్రమే కాకుండా, ఉద్యోగ ప్రపంచంలో నిలదొక్కుకునే నైపుణ్యాలతో కూడిన యువతను తయారు చేయడంగా ఉండాలి.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కర్నేతండా ప్రాజెక్ట్‌కు శ్రీకారం

- కొల్లాపూర్ అభివృద్ధికి మరో ముందడుగు
- మంత్రి కోమటిరెడ్డి, జూపల్లి చేతుల మీదుగా ప్రారంభం
- రూ.41.75 కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన
- సాగునీరు, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

వనపర్తి, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):



వనపర్తి జిల్లాలో కర్నేతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక రైతులకు సాగునీటి సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని వారు తెలిపారు. అనంతరం హెచ్‌ఏఎం ఫేజ్ 1లో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో రూ.41.75 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాన్గల్ ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి దావాజిపల్లి, ఖానాపూర్ మీదుగా పుల్గార్చెర్ల వరకు ఈ రహదారిని రెండు లేన్లుగా విస్తరించనున్నారు.
ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మౌలిక సదుపాయాల కల్పన అత్యంత కీలకమని అన్నారు. సాగునీరు, రహదారుల అభివృద్ధితో వ్యవసాయం, రవాణా రంగాలకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేస్తున్నామని చెప్పారు.
రహదారి విస్తరణ పనులు పూర్తయితే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల మధ్య అనుసంధానం బలపడుతుందని అధికారులు వివరించారు. ఈ పనులు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడనున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘా రెడ్డి, కూచుకుళ్ల రాజేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# క్రమశిక్షణకు అందరూ కట్టుబడాలి : సీఎం

- కొండా సురేఖ నోటీసులపై స్పందన
- పార్టీ వ్యవహారాలపై వ్యాఖ్యానించనన్న సీఎం
- నిర్ణయం క్రమశిక్షణా సంఘానిదే

హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసిన వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీ నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని పేర్కొన్నారు. క్రమశిక్షణ విషయంలో ఎవరూ మినహాయింపు కాదనే సందేశాన్ని ఆయన ఇచ్చారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను బహిరంగంగా వ్యాఖ్యానించడం సరికాదని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణా సంఘం పరిశీలిస్తోందని, తగిన నిర్ణయం తీసుకునే బాధ్యత ఆ కమిటీదేనని స్పష్టం చేశారు. పార్టీ వ్యవహారాలు పార్టీ వేదికలపైనే చర్చించబడతాయని పేర్కొన్నారు.
ఇటీవల వరంగల్ జిల్లా గీసుగొండలో నిర్వహించిన మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని పార్టీ నాయకత్వం సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణా సంఘం మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఘటనకు సంబంధించి వివరణ ఇవ్వాలని కోరింది. నోటీసు జారీ అనంతరం ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.
షోకాజ్ నోటీసుకు మంత్రి కొండా సురేఖ ఇప్పటికే లిఖితపూర్వక సమాధానం సమర్పించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయాలని, వాటికి తనను బాధ్యురాలిని చేయరాదని వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఈ వివరణపై క్రమశిక్షణా సంఘం పరిశీలన కొనసాగుతోంది. ఈ మొత్తం వ్యవహారంపై తుది నిర్ణయం పార్టీ క్రమశిక్షణా సంఘం తీసుకోనుంది. పార్టీ నియమ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణకు ఇచ్చే ప్రాధాన్యతను మరోసారి స్పష్టం చేశాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ఓటర్ల జాబితా పారదర్శకతకు గ్రామ సభలు

- - ఓటర్ల హక్కుల పరిరక్షణే లక్ష్యం
- - అనామలీస్ ఓటర్లకు నోటీసుల వేగవంతం
- - ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశం
- - తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):




రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించి ఓటర్ల జాబితా శుద్ధి ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక సమీక్ష చేపట్టారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని, ప్రతి అర్హ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.
గ్రామ, వార్డు సభల సందర్భంగా గైర్హాజరు, ఇతర ప్రాంతాలకు మారిన, మరణించిన, నకిలీ ఓటర్ల వివరాలను సంబంధిత బీఎల్‌ఓలు బహిరంగంగా చదివి వినిపించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చిన పేర్లను కూడా సభల్లో వెల్లడించి ప్రజల అభిప్రాయాలు స్వీకరించాలని ఆదేశించారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో పేరు చేరని వారి వివరాలను గుర్తించి పరిశీలించాలని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే అర్హత కలిగిన భారతీయ పౌరులు ఫారం 6 ద్వారా తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఓటర్ల పేర్ల తొలగింపులకు ఫారం 7, వివరాల సవరణలకు ఫారం 8 వినియోగంపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని పేర్కొన్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాలు, ధ్రువీకరణ ప్రక్రియలకు సంబంధించి అవసరమైన పత్రాలపై కూడా గ్రామ సభల్లో చర్చించాలన్నారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా అనామలీస్, నోమ్యాపింగ్ కేసులకు సంబంధించిన ఓటర్లకు నోటీసుల జారీని వేగవంతం చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ స్థలం, తేదీ, సమయాన్ని తప్పనిసరిగా స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. విచారణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్లు సమర్పించే పత్రాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులకు సూచనలు చేశారు.
అనామలీస్, నోమ్యాపింగ్‌కు సంబంధించిన జాబితాలను రాజకీయ పార్టీలతో పంచుకోవాలని, ఎన్నికల ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలకు సమాన సమాచారం అందేలా చూడాలని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో సమన్వయం కోసం ప్రతి వారం సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభల నిర్వహణకు సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేసి భవిష్యత్ పరిశీలనకు అందుబాటులో ఉంచాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా అన్ని జిల్లాల అధికారులు నోటీసుల జారీ, విచారణల నిర్వహణ, గ్రామ సభల ఏర్పాట్లపై పురోగతిని వివరించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి చర్య చేపట్టాలని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా దోషరహిత ఓటర్ల జాబితా రూపొందించి ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# సెప్టెంబర్‌లోగా వనమహోత్సవ లక్ష్యాలు పూర్తి చేయండి

- కొండా సురేఖ ఆదేశాలతో ప్రత్యేక కార్యాచరణ
- రేపు జిల్లావ్యాప్తంగా సామూహిక మొక్కల నాటకం
- మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి
- ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనానికి ప్రాధాన్యం

నారాయణపేట, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):



వనమహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో వనమహోత్సవ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక జిల్లా కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రస్తుత ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అన్ని జిల్లాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వర్షాకాలాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.
రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద ఎత్తున కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి మొక్కల నాటకం కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.
మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక కార్యాచరణ ఉండాలని కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కల వినియోగంతో పాటు అవసరమైన నీటి సౌకర్యాలను కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వనమహోత్సవ లక్ష్యాలను వేగంగా పూర్తిచేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, మొక్కల మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.




# సారంపల్లి మల్లారెడ్డి మృతికి కేసీఆర్ సంతాపం

- రైతు ఉద్యమానికి తీరని లోటని వ్యాఖ్య
- పోరాట యోధుడిగా కొనియాడిన బీఆర్ఎస్ అధినేత
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):

అఖిల భారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రైతాంగ హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన నాయకుడిగా మల్లారెడ్డి సేవలను ఆయన స్మరించుకున్నారు. రైతు సమస్యల పరిష్కారానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సారంపల్లి మల్లారెడ్డి రైతు ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని కేసీఆర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారని గుర్తుచేశారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేసిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.
వ్యవసాయ రంగానికి సంబంధించిన అనేక సమస్యలపై మల్లారెడ్డి గళమెత్తారని, రైతుల తరఫున ప్రభుత్వాల దృష్టికి అంశాలను తీసుకెళ్లారని కేసీఆర్ పేర్కొన్నారు. రైతాంగ ప్రయోజనాల కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. రైతు సంఘాల బలోపేతానికి కూడా ఆయన విశేష కృషి చేశారని వివరించారు. రైతు ఉద్యమాలకు అంకితభావంతో పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. భారత రైతాంగ ఉద్యమానికి ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఉద్యమాల ద్వారా రైతుల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన పాత్ర విశేషమని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిబద్ధతతో పోరాడిన నాయకుడిగా మల్లారెడ్డి చిరస్మరణీయంగా నిలుస్తారని కేసీఆర్ అన్నారు. సామాన్య రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారి తరఫున పోరాడటం ఆయన జీవిత లక్ష్యంగా మలుచుకున్నారని తెలిపారు. ఆయన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సారంపల్లి మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్ ప్రార్థించారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, రైతు ఉద్యమాల కోసం మల్లారెడ్డి చేసిన సేవలు ఎప్పటికీ ప్రజల మదిలో నిలిచిపోతాయని అన్నారు.

# బీసీ కులగణనతోనే సామాజిక న్యాయం

- జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపు
- ఆత్మగౌరవ సమస్యగా కులగణన అంశం
- ఇందిరాపార్క్ ధర్నాలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 24 (తెలంగాణ ముచ్చట్లు):

బీసీల కులగణన చేపట్టినప్పుడే వెనుకబడిన వర్గాలకు నిజమైన న్యాయం జరుగుతుందని పలువురు నేతలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, బీసీ ఇంటలెక్టువల్స్ ఫోరమ్ కన్వీనర్ చిరంజీవులు, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, గుజ్జ కృష్ణ, కోల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ దేశంలోని కోట్లాది బీసీల ఆత్మగౌరవానికి కులగణన అంశం ముడిపడి ఉందన్నారు. సమాజంలో బీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన సమాచారం వెలుగులోకి రావాలంటే సమగ్ర కులగణన అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అంశంపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు.
చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, పండుగ సాయన్న, చాకలి ఐలమ్మ, కొమరం భీమ్ వంటి మహనీయులు సామాజిక హక్కుల కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచనల ద్వారా వెనుకబడిన వర్గాల చరిత్ర, వారి సమస్యలను సమాజం తెలుసుకుందని పేర్కొన్నారు. బీసీల ఐక్యత ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కులాల పేరుతో సమాజాన్ని విభజించి కొన్ని వర్గాలను అధికారానికి దూరంగా ఉంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగకుండా బీసీలంతా ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా వెనుకబడిన వర్గాల హక్కుల కోసం అందరూ ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు.
ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీ కుటుంబాల వివరాలను కూడా పూర్తిస్థాయిలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ రాష్ట్రాల్లో ఒకే వర్గానికి భిన్న పేర్లు ఉండటం వల్ల గణనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ సమగ్ర కులగణన నిర్వహించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



బీసీలకు రాజ్యాధికారంలో వాటా, చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించే వారికే తమ మద్దతు ఉంటుందని నేతలు స్పష్టం చేశారు. సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమం సహా పలు సామాజిక ఉద్యమాల్లో బీసీలు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. యువత చైతన్యవంతమై రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమాల్లో పాల్గొనాలని, బీసీ హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in